సాక్షి
అనంతపురం
బుధవారం । 29 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.15 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



టమాట కిలో రూ.16
అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.9, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం 35.8°/11.5°
జిల్లా అంతటా మంగళవారం చలి వాతావరణం కొనసాగింది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పండ్ల తోటల పరిశీలన



రైతులతో శ్రీలంక ప్రతినిధులు

తాడిపత్రి రూరల్: మండలంలోని యర్రగుంట పల్లి సమీపంలో సాగు చేసిన పండ్ల తోటలను మంగళవారం శ్రీలంక దేశానికి చెందిన 12 మంది ప్రతినిధుల బృందం పరిశీలించింది. నారాయణరెడ్డి,నరేష్‌రెడ్డి, వెంకటనారాయణకి చెందిన అంజూర, నిమ్మ, మునగ, సీతాఫలం తోటలను పరిశీలించి రైతుల నుంచి సాగు వివరాలను తెలుసుకున్నారు. వారి వెంట రైతు సాధికారిత సంస్థ ఏటీ కృష్ణ చైతన్య, నరేంద్ర, అనురాధ, రైతులు, మహిళలు, సంఘాల సభ్యులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

- డీఏఓ ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

గార్లదిన్నె: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మంగళవారం గార్లదిన్నెలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం కందులు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రూ.7,550 గిట్టుబాటు ధర కల్పిస్తోందన్నారు. రబీలో పంటలు సాగుచేసిన రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ పంట, ఈకేవైసీ చేయించుకున్న రైతులు కొనుగోలు కేంద్రాల్లో కందులు విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీ రవి, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ ఏఈఓ స్రవంతి, మార్క్‌ఫెడ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దొంగలకు దేహశుద్ధి




రైతులకు పట్టుబడింది వీరే..

వజ్రకరూరు: మండలంలోని పొట్టిపాడు పరిసర ప్రాంతంలో మంగళవారం విద్యుత్ మోటార్లు, వైర్లను ఎత్తుకెళ్లేందుకు యత్నించిన దొంగలను గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. గ్రామ సమీపంలో హంద్రీనీవా కాలువ కింద సాగు చేసిన పంటలకు మంగళవారం ఉదయం నీరు పెడుతుండగా ఒక్కసారిగా మోటార్లు ఆగిపోయాయి. అనుమానం వచ్చి మోటార్ల వద్దకు వెళ్లిన రైతులు వైర్లు కత్తిరించి ఉండటం గమనించారు. దీనిపై సమీపంలో ఉన్న ముగ్గురు వ్యక్తులను ప్రశ్నించగా.. ఒకరు పారిపోయారు. మరో ఇద్దరు కూడా తప్పించుకునేందుకు ప్రయత్నించగా రైతులు వారిని పట్టుకుని గ్రామంలోకి తీసుకువెళ్లారు. ఆగ్రహించిన గ్రామస్తులు దొంగలకు దేహశుద్ధి చేసి వజ్రకరూరు పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు వజ్రకరూరు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు.

పట్టాలు తప్పిన ఎలక్ట్రిక్ రైల్ ఇంజిన్



రైలింజన్‌ను పట్టాలపైకి చేరుస్తున్న కార్మికులు

గుంతకల్లు: స్థానిక విద్యుత్ లోకో షెడ్ నుంచి రైల్వే స్టేషన్‌లోకి వస్తున్న ఎలక్ట్రిక్ రైలింజన్ పట్టాలు తప్పింది. వివరాలు... మంగళవారం సాయంత్రం యలహంక-కాచిగూడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలుకు అనుసంధానం చేసేందుకు విద్యుత్ లోకోషెడ్ నుంచి రైలింజన్‌ను ప్లాట్‌ఫారం ఒకటిపైకి లోకో పైలెట్ తీసుకొస్తుండగా ఆర్‌సీడీ సమీపంలోని పాయింట్స్ వద్ద పట్టాలు తప్పింది. మూడు చక్రాలు కిందికు దిగాయి. అప్రమత్తమైన లోకో పైలెట్ వెంటనే ఇంజన్‌ను ఆపేశాడు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్, ఇంజినీరింగ్, ఇతర విభాగాల సిబ్బంది అక్కడకు చేరుకున్ని కొన్ని గంటలు పాటు శ్రమించి రైలింజన్‌ను యథాస్థానానికి చేర్చి ముందుకు కదిలించారు.

ఉద్యోగులకు కుచ్చుటోపీ

- సరెండర్ లీవ్ బకాయిలు విడుదల చేస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించడంతో అనంతపురంలోని ఒక పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్ ఎంతో ఆనంద పడ్డాడు. 'సరెండర్'కు రూ.36 వేల చొప్పున తనకు అందించాల్సిన నాలుగింటిలో కనీసం రెండు ఇచ్చినా రూ.72 వేలు చేతికొస్తుందని, పిల్లలకు ఫీజు కట్టవచ్చని భావించాడు. తీరా సర్కారు ఒక సరెండర్ లీవ్‌కే డబ్బు అందించడంతో ఆయన ఆశలు ఆవిరయ్యాయి. దీంతో బయట కొంత అప్పుచేసి పిల్లల ఫీజు కట్టాడు.
- ప్రభుత్వ శాఖలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి కుమారుడు బెంగళూరులోని ఒక కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. రూ.2.20 లక్షలు కళాశాల ఫీజు కట్టాల్సి ఉంటే రూ.2.50 లక్షల పీఎఫ్ లోన్ పెట్టుకున్నారు. ఆరు నెలలైనా మంజూరు కాలేదు. 'సంక్రాంతికి ఉద్యోగులకు శుభవార్త... పీఎఫ్ లోన్ విడుదల చేస్తాం' అంటూ ప్రభుత్వం ప్రకటించడంతో ఆనందపడ్డాడు. సంక్రాంతి పోయి 14 రోజులైనా లోన్ మంజూరు కాలేదు. దీంతో కుమారుడి ఫీజు కట్టేందుకు అప్పు ప్రయత్నాలు ప్రారంభించాడు. వీరిద్దరే కాదు.. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరిదీ ఇదే పరిస్థితి.




- సర్కారు 'చేదు కబురు'
- సంక్రాంతి సందర్భంగా ఊరించి ఉసూరుమనిపించిన వైనం
- ఉద్యోగుల్లో కొందరికే పీఎఫ్ లోన్
- పోలీసుల నాలుగు సరెండర్లలో ఒకటే మంజూరు
- ప్రభుత్వ తీరుపై ఉద్యోగుల తీవ్ర అసంతృప్తి

అనంతపురం అర్బన్: ''సంక్రాంతి సందర్భంగా తీపి కబురు.. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ లోన్‌లు, సరెండర్ లీవులు, ఏపీజీఎల్‌ఐకి సంబంధించిన నిధులు విడుదల చేస్తున్నాం'' అంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయడంతో ఉద్యోగులు చాలా సంతోషపడ్డారు. పీఎఫ్ లోన్‌కు దరఖాస్తు చేసుకున్న వారు, 'సరెండర్ల' కోసం ఎదురు చూస్తున్న పోలీసులు ఉప్పొంగి పోయారు. అయితే, ఎంతో ఆశ పెట్టిన చంద్రబాబు ప్రభుత్వం చివరికి నిరాశే మిగిల్చింది. 'తీపి కబురు' సంగతేమో కానీ, తమకు మాత్రం చేదే మిగిలిందంటూ ఉద్యోగులు నిట్టూరుస్తున్నారు.

కొందరికే పీఎఫ్..

వివిధ అవసరాల నిమిత్తం ఉద్యోగులు పీఎఫ్ ఖాతా నుంచి రుణం తీసుకుంటారు.



జిల్లావ్యాప్తంగా ఇలా వివిధ శాఖల ఉద్యోగులు దాదాపు 512 మంది (గత డిసెంబరు వరకు) దరఖాస్తు చేసుకున్నారు. ఈ మొత్తం సుమారు రూ.42.14 కోట్ల వరకూ ఉంటుంది. ప్రభుత్వం ఆరు నెలులగా పీఎఫ్ లోన్ మంజూరు చేయలేదు. దీంతో చెల్లింపులు జరగలేదు. ఈ క్రమంలో నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఉద్యోగులు ఎంతో సంతోషించారు. కానీ, చంద్రబాబు సర్కారు కొందరికే పీఎఫ్ అందించి.. చాలా మందికి కుచ్చుటోపీ పెట్టింది. ఒక కటాఫ్ తేదీ పెట్టుకుని.. ఆ తేదీకి ముందు లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికే మంజూరు చేసినట్లు తెలిసింది.

ఖాకీలకు ఖేదం..

పోలీసులకు 'సరెండర్' బకాయిల విడుదలలో కూడా కూటమి సర్కారు మొండిచేయి చూపింది. ఇప్పటివరకూ నాలుగు సరెండర్లకు సంబంధించిన బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. వేతనం ఆధారంగా ఒక 'సరెండర్'కు రూ.25 వేల నుంచి దాదాపు రూ.లక్ష వరకు వస్తుందని చెబుతున్నారు. దీని ప్రకారం ఒక్కొక్కరికి రూ. లక్ష నుంచి రూ.4 లక్షల వరకు రావాలి. నాలుగు కాకపోయినా ప్రభుత్వం రెండైనా ఇస్తుందని ఎంతో ఆశపడ్డారు. తీరా ఒక్క 'సరెండరే' ఇవ్వడంతో తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు.

ఐఆర్ అయినా ఇచ్చేరా..?

ఉద్యోగులకు మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. సీఎం చంద్రబాబు తీరు గమనిస్తుంటే ఐఆర్ ఇస్తారా అనే సందేహం కలుగుతోందంటున్నారు. ఇక పీఆర్‌సీ ఉంటుందా అనేది కూడా అర్థం కావడం లేదని వాపోతున్నారు. మొత్తం మీద ప్రభుత్వ చర్యలతో తాము ఆందోళనలో కూరుకుపోతున్నామని చెబుతున్నారు.

వేగవంతంగా హంద్రీ-నీవా కాలువ వెడల్పు పనులు

- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి కేశవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం సెంట్రల్: కర్నూలు జిల్లా మల్యాల నుంచి జీడిపల్లి రిజర్వాయర్ వరకూ హంద్రీ-నీవా కాలువ వెడల్పు పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో హంద్రీనీవా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జంగిల్ క్లియరెన్స్ పనులు మొదలుపెట్టినట్లు తెలిపారు. తర్వాత డ్రోన్ ద్వారా ఫొటోలు తీయాలని సూచించారు. భూసేకరణకు సంబంధించి పరిహారం చెల్లించేందుకు సీఎంఎస్‌ఎస్‌లో నమోదు చేయాలన్నారు.కాలువ వెడల్పులో భాగంగా అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. 33,34 ప్యాకేజీల్లో కూడా జంగిల్ క్లియరెన్స్ చేయాలని, ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఉరవకొండ నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల్లో అవసరమైన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హంద్రీ-నీవా కర్నూలు ఎస్ఈ వరప్రసాద్, భూసేకరణ ఎస్‌డీసీ మల్లికార్జున, గుంతకల్లు ఈఈ శ్రీనివాస్‌నాయక్, ఈఈ చంద్రశేఖర్, ట్రాన్స్‌కో ఈఈ శేషాద్రి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లు అందించాలి

- కంట్రోల్ రూంలు ఉదయం 6 గంటలకే అందుబాటులోకి రావాలి
- కాలనీల్లో నిర్మాణం పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం: లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లు అందించాలని కలెక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 'ఎన్టీఆర్ భరోసా పథకం' కింద ఫిబ్రవరి ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 6 గంటలకే పెన్షన్ల పంపిణీ ప్రారంభించి మధ్యాహ్నం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడ నుంచి జియో ట్యాగ్ చేశారో అక్కడికే వెళ్లి పింఛను అందించాల్సి ఉంటుందన్నారు. మండల స్థాయిలో కంట్రోల్ రూంలు ఉదయం ఆరు గంటలకే అందుబాటులో ఉండాలన్నారు. బ్యాంకుల నుంచి సకాలంలో డబ్బులు డ్రా చేసుకోవాలన్నారు. హౌసింగ్ కాలనీల్లో నిర్మాణం పూర్తయిన ఇళ్లకు సంబంధించిన తాళాలు ఒకటో తేదీన అప్పగించాలని, ఇందులో ప్రత్యేక అధికారులు పాల్గొనాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, ఎల్‌డీఎం నర్సింగరావు, హౌసింగ్ పీడీ శైలజ, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించాలని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. రెవెన్యూ భవన్‌లో మంగళవారం కేజీబీవీ, మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో యూడైస్‌ని పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టాలన్నారు. ప్రిన్సిపాళ్లు కేవలం ఉపాధ్యాయుల్లా కాకుండా నాయకత్వ పాత్ర పోషించాలని సూచించారు. బాగా చదువుతున్న వారిని ప్రశంసిస్తూనే, చదవలేని వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వచ్చే రెండు నెలల పాటు ప్రిన్సిపాళ్లు బాగా పనిచేయాలని కోరారు. విద్యార్థులందరికీ మంచి మార్కులు వచ్చేలా చూడాలన్నారు. పరీక్షల కోసం షెడ్యూల్ రూపకల్పన చేసుకోవాలని సూచించారు. చిత్తశుద్ధితో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, సీఎంఓ గోపాల్, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'హార్టికల్చర్ కాంక్లేవ్' వాయిదా

జిల్లాకేంద్రంలో ఈ నెల 31న జరగాల్సిన హార్టికల్చర్ కాంక్లేవ్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మళ్లీ సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామన్నారు. రెవెన్యూభవన్‌లో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 31న ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో ఐడీ లిక్కర్‌కు సంబంధించి న్యూపాలసీలో భాగంగా 'నవోదయం' కార్యక్రమం జరుగుతుందని, ఇందులో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో 'హార్టికల్చర్ కాంక్లేవ్'ను వాయిదా వేశామన్నారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి వివిధ కమిటీలను ఏర్పాటు చేశామని, కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి. వినూత్న తదితరులు పాల్గొన్నారు.

జవాబు పత్రాలకు రెక్కలు!

- 193 మంది విద్యార్థుల జవాబుపత్రాల గల్లంతు
- ఎంత గాలించినా దొరకని వైనం
- విద్యార్థులకు మళ్లీ పరీక్షలు నిర్వహించేందుకు కసరత్తు
- అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు ఇక్కట్లు



జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షల విభాగం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షల విభాగం అధికారుల అలసత్వం మరోసారి బయట పడింది. ఈ సారి ఏకంగా విద్యార్థుల జవాబు పత్రాలు గల్లంతు కావడం దుమారం రేపింది. నెల రోజుల క్రితమే ఈ విషయం బయటపడినా బయటకు పొక్కకుండా జాగ్రత్త పడటం గమనార్హం. తమ భవిష్యత్తును నిర్దేశించే జవాబు పత్రాలు కనిపించకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.

గత నెలలో పరీక్ష..

చిత్తూరు జిల్లాలోని జేఎన్‌టీయూ అనుబంధ 'వేము ఇంజినీరింగ్ కళాశాల'లో డిసెంబర్ 10న ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థులకు కంట్రోల్ సిస్టమ్ ఇంజినీరింగ్ సబ్జెక్టు పరీక్ష(ఆర్-20 రెగ్యులర్) నిర్వహించారు. పరీక్ష పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను వేము కళాశాల నుంచి రిజిస్టర్ పోస్టు ద్వారా జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షల విభాగానికి పంపారు. ఈ మేరకు రిజిస్టర్ పోస్టులోనూ నమోదు చేశారు. జవాబు పత్రాలు వచ్చినట్లు జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షల విభాగంలోనూ నమోదైంది. ఇంత వరకూ బాగానే ఉన్నా పరీక్షల విభాగంలో ఆ తర్వాత జవాబు పత్రాలు కనిపించకుండా పోవడం ఆందోళన రేపింది. విభాగంలో అణువణువూ సిబ్బంది జల్లెడ పట్టినా వాటి జాడ కనిపించలేదు. ఈ నేపథ్యంలో పరీక్షల విభాగం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం బట్టబయలైనట్లయింది. పరీక్ష ఫలితాల విడుదలలో జాప్యం తలెత్తింది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా..

నెల రోజుల క్రితమే విషయం బయటపడినా.. వర్సిటీ ఉన్నతాధికారులకు తెలియజేయకుండా తొక్కిపెట్టాలని ప్రయత్నం చేయడం సర్వత్రా విమర్శలకు దారి తీసింది. చివరికి చేసేది లేక వారి దృష్టికి తీసుకెళ్లి.. విద్యార్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు.

పరిశీలించాలని చెప్పాం

జవాబు పత్రాల గల్లంతు వ్యవహారం రెండు రోజుల క్రితం నా దృష్టికి వచ్చింది. ఎక్కడ పొరపాటు జరిగిందో పరిశీలించాలని ఆదేశించాం. పోస్టాఫీసులో మరో దఫా సంప్రదించాలని కోరాం. జవాబు పత్రాల బండిల్ ఇచ్చారా.. లేదా అని ఆరా తీస్తున్నాం.

– ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, ఇన్‌చార్జ్ వీసీ, జేఎన్‌టీయూ (ఏ)

నాన్ జ్యుడీషియల్ స్టాంపులు కావలెను!

- అందుబాటులో లేని రూ.100, రూ. 50 స్టాంపులు
- జిల్లాలో రెండు నెలలుగా దుస్థితి
- వినియోగదారులకు తీవ్ర ఇక్కట్లు



అనంతపురం టౌన్: జిల్లాలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు నిండుకున్నాయి. రెండు నెలలుగా సమస్య నెలకొంది. దీంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజూ పదుల సంఖ్యలో స్థిరాస్తుల క్రయ, విక్రయాల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఈ క్రమంలో జ్యుడీషియల్ స్టాంపులు అందుబాటులో లేక రిజిస్ట్రేషన్లు సైతం నిలిచిపోతున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ ఈ స్టాంపింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చినా, దీనిపై వినియోగదారులు ఆసక్తి చూపించడం లేదు. రూ.100, రూ. 50 స్టాంపులు లేక నెలలు గడుస్తున్నా అధికార యంత్రాంగం ఏమాత్రం స్పందించడం లేదు.

ఆదాయం కోల్పోతున్న వైనం..


జిల్లాలో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విక్రయాలతో రిజిస్ట్రేషన్ శాఖకు నెలకు దాదాపు రూ.2 కోట్లకు పైగానే ఆదాయం వచ్చేది. రామ్‌నగర్ ప్రధాన కార్యాలయంలోని స్టాంపుల విక్రయ కేంద్రంలోనే నెలకు రూ.1.50 కోట్ల విలువ చేసే స్టాంపులను విక్రయించే వారు. రెండు నెలలుగా స్టాంపులు లేకపోవడంతో విక్రయ కేంద్రం బోసిపోతోంది. ప్రధానంగా జిల్లాలో గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, పామిడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అధిక సంఖ్యలో స్థిరాస్తుల క్రయ, విక్రయాలు జరుగుతాయి. స్టాంపులు లేని కారణంగా రిజిస్ట్రేషన్లు సైతం గతంతో పోలిస్తే భారీగా తగ్గిపోయాయి. ఈ విషయంపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మిని వివరణ కోరగా ఇండెంట్ పంపామని, రెండు మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్టాంపులు సరఫరా చేస్తామని తెలిపారు.

5 నుంచి కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు

బుక్కరాయసముద్రం: మండలంలో కొలువైన కొండమీదరాయ స్వామి ఉత్సవాలు ఫిబ్రవరి 5న ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతపురం నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవరకొండపై కొండమీదరాయ స్వామి ఆలయం ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో రూ. 4 కోట్లు వెచ్చించి కొండపైకి మెట్ల మార్గంతో పాటు సిమెంట్ రోడ్డు వేశారు. ఇరువైపులా హైమాస్ లైట్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించారు.

10 రోజులు ఉత్సవాలు..

కొండమీద రాయుని బ్రహ్మోత్సవాలు 10 రోజులు జరగనున్నాయి. ఫిబ్రవరి 5న సాయంత్రం బుక్కరాయసముద్రంలోని లక్ష్మీ నారాయణస్వామి ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులను కొండపైకి తీసుకెళ్తారు. 6న ఉదయం 8 గంటలకు దేవరకొండపై పుణ్యాహవాచనము, దేవతా హోమం, ధ్వజా రోహణము, గరుడ ఆహ్వాన పూజ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి 8 గంటలకు స్వామి వారికి పుష్ప పల్లకీ సేవ ఉంటుంది. 7న స్వామి వారిని సింహ వాహనంపై మండల కేంద్రంలో ఊరేగిస్తారు. 8న శేష వాహన, 9న హనుమద్వాహన, 10న గరుడ, 11న శ్వేత గజ వాహన సేవలు నిర్వహిస్తారు.

కొండపై స్వామివారి మూల విరాట్, దేవరకొండపై ఆలయం

12న రథోత్సవం

కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన కార్యక్రమాలైన కల్యాణ, రథోత్సవాలు ఫిబ్రవరి 12న జరగనున్నాయి. ఆ రోజు వేకువ జామున స్వామి వారికి కల్యాణ మహోత్సవం ఉంటుంది. ఉదయం 11.30 గంటలకు సూర్యప్రభ వాహనంపై గరుడాద్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీ నారాయణస్వామి దేవాలయం నుంచి పురవీధుల్లో ఊరేగిస్తారు. సాయంత్రం మండల కేంద్రంలో రథోత్సవం నిర్వహిస్తారు. రథోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. ఇక.. 13న రాత్రి 7 గంటలకు అశ్వవాహన సేవ, 14న ఉదయం 7 గంటలకు తీర్థవాది వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు హంస వాహన సేవలు నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

తాగు నీరివ్వండి మహాప్రభో..



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

రాయదుర్గం టౌన్: తాగునీటి కోసం స్థానిక కణేకల్లు మార్గంలోని ఎంసీపీ లే అవుట్ కాలనీవాసులు ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. నెల రోజులుగా తాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా... కనీసం కాలనీ వైపు కన్నెత్తి కూడా చూడలేదని మండిపడ్డారు. కాలనీలో కనీసం వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి పూట చిమ్మచీకటిలో బిక్కుబిక్కుమంటూ జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఏఈ ప్రతాప్, సీఐ జయానాయక్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. 15 రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని, ఓ ట్యాంకర్ ఏర్పాటు చేసి రోజూ నీటి సరఫరా చేస్తామని ఏఈ ప్రతాప్ హామీ ఇచ్చారు. దీనిపై కాలనీవాసులు అసహనం వ్యక్తం చేశారు. తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. దీంతో దాదాపు అరగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించి కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి.

గుత్తి ఆర్ఎస్‌లో చోరీ

గుత్తి: స్థానిక ఆర్ఎస్ పరిధిలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు.... గుత్తి ఆర్ఎస్‌లోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో నివాసముంటున్న గోపి, రేవతి దంపతులు సోమవారం ఇంటికి తాళం వేసి పనిపై మరో ఊరికి వెళ్లారు. విషయాన్ని గుర్తించిన దుండగులు తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాలోని విలువైన బంగారు, వెండి ఆభరణాలు అపహరించారు. మంగళవారం ఉదయం ఇంటికి చేరుకున్న గోపి దంపతులు... చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సురేష్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులను రంగంలో దించి నిందితుల ఆధారాలు సేకరించారు. బీరువాలో భద్రపరిచిన ఓ తులం బంగారు, 30 తులాల వెండి ఆభరణాలు చోరీ అయినట్లు బాధితుడు అందజేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఎన్నికల విభాగం... ఇష్టారాజ్యం!



- రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల డేటా ఎంట్రీ ఆపరేటర్ (ఈడీఈఓ)గా గతంలో పనిచేసిన వ్యక్తి సార్వత్రిక ఎన్నికల సమయంలో అవకతవకలకు పాల్పడ్డాడు. ఓటరు జాబితా ఎంట్రీల్లో ఆయన అక్రమాలకు పాల్పడినట్లు అప్పటి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ వసంతబాబు గుర్తించి, ఆయనను సరెండర్ చేశారు. అయితే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్డర్ లేకుండా కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగంలో ఆయనకు పోస్టింగ్ ఇచ్చారు.

- ఈడీఈఓ సంఘం నేత గోపాల్ రాయదుర్గం నివాసి. అయితే ఆయనను కళ్యాణదుర్గం నియోజకవర్గం శెట్టూరు తహసీల్దారు కార్యాలయ ఈడీఈఓగా నియమించారు. ఇతనికి ముగ్గురు కుమార్తెలున్నారు. వచ్చే జీతం రూ.16,411 రానుపోనూ చార్జీలకే సరిపోతోంది. రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో నియమించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఉన్నతాధికారులు పెడచెవిన పెడుతూ వచ్చారు.

- అనంతపురం ఆర్డీఓ ఆఫీసు, అనంతపురం తహసీల్దారు కార్యాలయం, అనంతపురం నగర పాలక సంస్థలోనూ ఈడీఈఓలు ఉన్నారు. అయితే వీరు వారికి కేటాయించిన స్థానంలో కాకుండా ఆర్డీఓ కార్యాలయంలోనే విధులు నిర్వర్తిస్తున్నట్లు సమాచారం. ఇలాగే తాడిపత్రి, మరికొన్ని నియోజకవర్గాల్లోనూ ఈడీఈఓల కొలువు ఒక చోటయితే విధులు మరో చోట నిర్వర్తిస్తున్నట్లు తెలిసింది.

- కలెక్టర్ ఉత్తర్వులు లేకుండానే నియామకాలు
- సరెండర్ ఈడీఈఓకు కలెక్టరేట్‌లో విధులు
- కొందరికి కొలువొకచోట.. విధులొకచోట



ఎన్నికల విభాగం

అనంతపురం అర్బన్: జిల్లా ఎన్నికల విభాగం అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహారాలు సాగిస్తున్నారు. సరెండర్ చేసిన ఎన్నికల డేటా ఎంట్రీ ఆపరేటర్ (ఈడీఈఓ)ను కలెక్టర్ ఆర్డర్ లేకుండానే కలెక్టరేట్‌లో నియమించుకుని కీలక విధులు అప్పగించారు. మరికొందరు ఈడీఈఓలు మరో అడుగు ముందుకు వేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నియమించిన చోట కాకుండా మరో చోట విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలాంటి వారు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకుల అండతో చెలరేగిపోతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక ఎవరి అండదండలు లేని ఈడీఈఓల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఒక నియోజకవర్గం పరిధిలోని వారిని మరో నియోజకవర్గం పరిధిలోని మండలాలకు మార్చడంతో తమ కష్టం ఎవరికి చెప్పుకోలేక.... వస్తున్న రూ.16 వేలు వేతనం చార్జీలకే సరిపోతుంటే... కుటుంబపోషణను భారంగా నెట్టుకొస్తున్నారు.

కలెక్టర్ ఆర్డర్ లేకుండానే

సరెండర్ చేయబడిన ఉద్యోగికి పోస్టింగ్ కల్పించాలంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరి. అయితే ఈడీఈఓ అంశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉత్తర్వులు లేకుండానే కలెక్టరేట్‌లో నియమించుకున్నారంటే... ఇక్కడి అధికారుల తీరు ఏమిటనేది స్పష్టమవుతోంది. రాప్తాడు నియోజవర్గం పరిధిలో ఈడీఈఓగా పనిచేసిన వ్యక్తి గత ఎన్నికల సమయంలో ఓటర్ల తొలగింపు దరఖాస్తుల విషయంలో అవకతవలకు పాల్పడినట్లు ఈఆర్ఓ (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి) గుర్తించారు. దీంతో ఆ వ్యక్తిని సరెండర్ చేశారు. అయితే ఈడీఈఓని అనధికారికంగా కలెక్టరేట్‌లో నియమించుకుని విధులు అప్పగించారు.

కలెక్టర్ దృష్టికి వెళ్లని లేఖలు

ఈడీఈఓని నియమించాలని కోరుతూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఈఆర్ఓలు రాసిన లేఖలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లకుండా ఎన్నికల విభాగం అధికారులు తొక్కిపెడుతున్నట్లు సమాచారం. రాప్తాడు నియోజకవర్గం ఈడీఈఓని సరెండర్ చేశాం... ఆ స్థానంలో మరొకరిని నియమించాలంటూ గతంలో ఈఆర్ఓగా పనిచేసిన డిప్యూటీ కలెక్టర్ వసంతబాబు రాసిన లేఖ ఇప్పటి వరకూ కలెక్టర్ దృష్టికి వెళ్లక పోవడమే ఇందుకు నిదర్శనం. ఈడీఈఓని నియమించాలంటూ ఆయన తరువాత ఈఆర్ఓగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కలెక్టర్ రమేష్‌రెడ్డి సైతం రాసిన లేఖ కలెక్టర్ దృష్టికి వెళ్లలేదు. ఇక ప్రస్తుతం ఈఆర్ఓగా ఉన్న డిప్యూటీ కలెక్టర్ శిరీష్ కూడా ఈడీఈఓను నియమించాలంటూ జిల్లా ఎన్నికల అధికారికి లేఖ రాశారు. మరి దీనినైనా కలెక్టర్ దృష్టికి ఎన్నికల విభాగం అధికారులు తీసుకెళుతారా? లేక తొక్కిపెడతారా అనేది వేచి చూడాలి.

విచారణ చేసి చర్యలు తీసుకుంటా



రాప్తాడు నియోజకవర్గ ఈడీఈఓ అంశం నా దృష్టికి రాలేదు. విచారణ చేసి చర్యలు తీసుకుంటాను. ఇక నియమించిన స్థానంలో కాకుండా వేరే చోట విధులు నిర్వర్తించకూడదు. ఈ విషయంపై తదుపరి జరిగే సమావేశంలో స్పష్టమైన ఆదేశాలిస్తాను. ఒక నియోజకవర్గం పరిధిలో నివాసముంటున్న ఈడీఈఓని మరో నియోజకవర్గం పరిధిలో కాకుండా మానవతాదృక్పథంతో అదే నియోజకవర్గంలో నియమించేలా చర్యలు తీసుకుంటాం.

– వి.వినోద్‌కుమార్, జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్

వ్యక్తిపై వేధింపుల కేసు నమోదు

కదిరి టౌన్: వివాహితను లైంగిక వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కదిరిలోని ఓ మైనారిటీ కాలనీలో నివాసముంటున్న వివాహిత టైలరింగ్‌తో కుటుంబాన్ని పోషించుకుంటోంది. పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్న ఆమె వ్యాపార నిమిత్తం సంఘంలో రూ.4 లక్షల వరకు రుణం తీసుకుంది. అయితే ఈ మొత్తానికి సంబంధించి కంతులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న చింతకుంట మాబు.. ఆమెను లోబర్చుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. రుణం కంతులు తాను చెల్లిస్తానని, అయితే తన కోరిక తీర్చాలంటూ తరచూ వేధించసాగాడు. వేధింపులు తారాస్థాయికి తీసుకెళ్లి తన కోరిక తీర్చకపోతే ఆమె ఇంటి వద్ద ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు చింతకుంట మాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నిత్యావసరాల పంపిణీ సకాలంలో జరగాలి



మాట్లాడుతున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం: నిర్ణీత సమయంలోపు నిత్యావసర సరుకుల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి పౌర సరఫరా శాఖ సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... మండల పరిధిలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా మరింత పెంచాలన్నారు. దీపం-2 పథకం క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలన్నారు. అలాగే గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే సమయంలో సరఫరా వ్యక్తులు అదనపు చార్జీలు వసూలు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు సొమ్ము వసూలు చేసినట్లుగా తెలిస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీ లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్‌షాపులకు బియ్యం సరఫరా చేసేటప్పుడు, రేషన్ షాపు నుంచి కార్డుదారునికి పంపిణీ చేసేటప్పుడు తూకంలో ఎలాంటి తేడాలు ఉండరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు కూలీల సంక్షేమంపై దృష్టి సారించని ప్రభుత్వాలు

- ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు



సదస్సును ప్రారంభిస్తున్న ఐవైఆర్ కృష్ణారావు

అనంతపురం: స్వాతంత్ర్యానంతరం దేశంలో రైతు కూలీల సంక్షేమంపై ఏ ప్రభుత్వమూ దృష్టి సారించలేదని ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణా రావు అన్నారు. 'భూమి లేని వ్యవసాయ కూలీల సమగ్ర అభివృద్ధికి మార్గదర్శకం' అంశంపై గ్రామీణాభివృద్ధి, సామాజిక సమ్మిళిత అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వేదికగా మంగళవారం జాతీయ సదస్సు జరిగింది. కార్యక్రమానికి ఐవైఆర్ కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పనికి తగ్గ కూలి లభిస్తే కుటుంబపోషణకు దోహదపడుతుందన్నారు. కొన్ని సామాజిక వర్గాలు జ్ఞానంతో వృద్ధి చెందారన్నారు. ప్లాస్టిక్ కారణంగా కొన్ని కులవృత్తుల (కుమ్మరి) ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమయ్యాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నైపుణ్యం లేని వారే చివరకు రైతు కూలీలుగా మిగిలిపోతున్నారన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు మాట్లాడుతూ.. దేశంలో 41.63 శాతం మంది ఎలాంటి జీవనాధారం లేని కూలీలు ఉన్నారని తెలిపారు. 60 ఏళ్లు దాటిన రైతు కూలీలకు శ్రమయోజన కార్డులు అందించాలన్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ, విత్తనాల ధరలు పెరగడం, రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు రైతు కూలీలకు మధ్య సత్సంబంధాలు అవసరమన్నారు. గ్రామీణాభివృద్ధి విభాగాధిపతి ప్రొఫెసర్ మునినారాయణప్ప అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ కె.వెంకటరెడ్డి, డాక్టర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. అతి వేగమే ప్రమాదాలకు కారణమని తెలుస్తోంది. వివరాలు...



మృతుడు శర్మష్ వలి

గార్లదిన్నె: అనంతపురం రూరల్ పరిధిలోని కొడిమి కొట్టాల గ్రామానికి చెందిన చెందిన శర్మష్ వలి (20) ఐచర్ వాహన డ్రైవరుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం వ్యక్తిగత పనిపై గుత్తికి వెళ్లిన ఆయన... రాత్రి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. గార్లదిన్నె మండలం రామదాసుపేట సమీపంలోని నల్లగుట్ట వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై వేగాన్ని నియంత్రించుకోలేక డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, శర్మష్ వలి మృతదేహాన్ని అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

గుత్తి రూరల్: మండల పరిధిలోని 67వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని పి.కొత్తపల్లికి చెందిన చాకలి పవన్ (22), గొల్ల పవన్ వ్యక్తిగత పనిపై మంగళవారం గుంతకల్లుకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని రాత్రి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు రజాపురం వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కన ఉన్న మట్టి కుప్పపైకి దూసుకెళ్లడంతో వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఘటనలో చాకలి పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన గొల్ల పవన్‌ను అటుగా వెళుతున్న వారు గమనించి అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కూటమి చెప్పిందొకటి... చేస్తోందొకటి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: అధికారంలోకి రాకముందు కూటమి పెద్దలు ఒక విధంగా చెప్పి... ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత మరోలా చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 117 జీఓ సవరణగా వచ్చిన మెమోకు భిన్నంగా ఉన్నతాధికారులు కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విధానాలను ఏపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రతి వారం ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చలలో విద్యాశాఖ డైరెక్టర్ చెప్పిన విధానాలు అమలు కావడం లేదన్నారు. 117 జీఓ ఎంత నష్టాన్ని తెచ్చిందో అందుకు ప్రత్యామ్నాయంగా జరుగుతున్న ఏర్పాటు మరింత నష్టం చేకూర్చేలా ఉందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో విద్యార్థుల సంఖ్య 60కు మించి ఉన్న పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించాలని పేర్కొన్నారన్నారు. మౌలిక వసతులు లేని పాఠశాలలను ఉన్నతీకరించకుండా అక్కడి తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసేలా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలల్లో 60 కంటే ఎక్కువ సంఖ్యలో విద్యార్థులుంటే వాటిని మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా మార్చేలా ప్రకటన చేశారన్నారు. అక్కడ కూడా వసతులు లేకపోతే మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా మార్చొద్దని ఉన్నతాధికారులు చెబుతున్నారన్నారు.

భర్త మందలింపు.. భార్య ఆత్మహత్య



మృతురాలు అశ్విని

అనంతపురం: భర్త మందలింపుతో మనస్తాపం చెంది భార్య ఆత్మహత్య చేసుకుంది. పోలీసులకు మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు... శ్రీసత్యసాయి జిల్లా ఎన్పీ కుంట మండలం వడ్డిపల్లి గ్రామానికి చెందిన రమణయ్య కుమార్తె అశ్విని (25)కి అదే గ్రామానికి చెందిన ఎం.వెంకటరమణ కుమారుడు గంగాధర్‌తో ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల వయసున్న కుమారుడు, మూడేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. మూడేళ్ల క్రితం గంగాధర్ కువైట్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణకు భర్త సంపాదన సరిపోదని భావించిన అశ్విని... అనంతపురంలోని శ్రీనగర్ కాలనీలో కేవీఆర్ కన్‌స్ట్రక్షన్ ఎదురుగా ఉన్న అమరనాథ్ చౌదరి ఇంట్లో అద్దెకు ఉంటూ కూలి పనులతో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో అనారోగ్యానికి గురైన ఆమె ఈ నెల 24న వడ్డిపల్లిలోని తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. ఈ నెల 25న కువైట్ నుంచి గంగాధర్ ఫోన్ చేసి అశ్వినితో మాట్లాడాడు. ఆ సమయంలో ఆమె ఇంకా అనంతపురానికి వెళ్లకపోవడంతో తీవ్ర స్థాయిలో మందలించాడు. దీంతో ఆమె అనంతపురానికి చేరుకుంది. అప్పటి నుంచి తరచూ ఇద్దరూ ఫోన్‌లోనే గొడవ పడుతూ వచ్చారు. సోమవారం పలుమార్లు గంగాధర్ ఫోన్ చేసినా అశ్విని సమాధానం ఇవ్వలేదు. దీంతో తన బంధువు తిరుమలేష్‌కు ఫోన్ చేసి అశ్వినితో మాట్లాడాడు. ఫోన్ ఎత్తడం లేదంటూ దుర్భాషలాడాడు. దీంతో క్షణికావేశానికి లోనైన ఆమె మంగళవారం ఇంట్లోని ఎలుకల మందును నీటిలో కలుపుకుని తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై నాల్గో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదంలో యూపీ వాసి మృతి

గోరంట్ల: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో యూపీకి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు... ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కొందరు పాలసముద్రం వద్ద ఉన్న నాసిన్ అకాడమీలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తన బంధువు రవి ఇంటికి ఇటీవల యూపీకి చెందిన జిందూ యాదవ్ కుమారుడు ఆనంద్ యాదవ్ (18) వచ్చాడు. మంగళవారం ఉదయం అకాడమీ వద్దకు ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆనంద్‌యాదవ్ మార్గమధ్యంలో నియంత్రణ కోల్పోవడంతో డివైడర్‌ను ఢీకొని కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను అటుగా వెళుతున్న వారు గుర్తించి వెంటనే హిందూపురంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆనంద్‌యాదవ్ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి దుర్మరణం



సుభద్రమ్మ (ఫైల్)

ఉరవకొండ: లారీ ఢీకొని ఓ వృద్ధురాలు దుర్మరణం పాలైంది. స్థానికులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం చిన్నముష్టూరు గ్రామానికి చెందిన సుభద్రమ్మ (77) మంగళవారం ఉదయం రహదారి దాటుతున్న సమయంలో వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ వెంటనే అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కుక్కదాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురంలో మంగళవారం కుక్క దాడి చేయడంతో వృద్ధురాలు చంద్రకళ తీవ్రంగా గాయపడింది. గ్రామ శివారులోని తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా ఉన్నఫళంగా కుక్క దాడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

వివాహ వేడుకలో అపశ్రుతి



చికిత్స పొందుతున్న మాబు

గుత్తి: వివాహ వేడుకలో మర్యాదల విషయంగా ఘర్షణ చోటు చేసుకుని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి గ్రామంలో సోమవారం రాత్రి వివాహ వేడుక మొదలైంది. ఈ క్రమంలో తాంబూలం అందిపుచ్చుకునే విషయంలో కిష్టిపాడుకు చెందిన కొందరు గుత్తికి చెందిన వారితో ఘర్షణ పడ్డారు. ఇద్దరి మధ్య మాటామాట పెరిగి పరస్పర దాడులు చేసుకున్నారు. ఘటనలో మాబు, ఆసీఫ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

కారు బోల్తా .. మహిళ మృతి

గుత్తి రూరల్: కారు బోల్తాపడిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన శ్రీలత (38), తన కుటుంబంతో కలసి హైదరాబాదులో స్థిరపడ్డారు. బంధువుల ఇంట శుభకార్యం ఉండడంతో మంగళవారం ఉదయం కారులో హైదరాబాద్ నుంచి కదిరికి బయలుదేరారు. గుత్తి మండలం పోదొడ్డి వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న శ్రీలతను స్థానికులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. స్వల్ప గాయాలైన వారికి చికిత్స అందజేశారు. ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని మహిళ మృతి

గార్లదిన్నె: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నెకు చెందిన గౌరి (40) మంగళవారం వ్యక్తిగత పనిపై కల్లూరు గ్రామానికి వెళ్లింది. ఈ క్రమంలో రైలు పట్టాల పక్కన నడుచుకుంటూ వెళుతున్న సమయంలో శరవేగంగా ఓ రైలు దూసుకెళ్లింది. ఆ సమయంలో రైలు వేగం ఆమెను లాగేయడంతో రైలు బోగీ తగిలి తీవ్ర గాయాలతో పట్టాల పక్కన పడింది. అటుగా వెళుతున్న వారు గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఘటనపై ఎస్ఐ గౌస్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం ఎన్నికలు నేడు

అనంతపురం కల్చరల్: జిల్లా 'డాగురే ఫొటో వీడియో గ్రాఫర్ల అసోసియేషన్' ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. అనంతపురంలోని లలిత కళాపరిషత్తు వేదికగా ఉదయం 8 నుంచి సాయంత్రం వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగనుందని ఆ సంఘం ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కోడిగుడ్లలో పురుగులు



కుళ్లిన కోడి గుడ్డులో నుంచి బయటకొస్తున్న పురుగులు

మడకశిర రూరల్: పౌష్టికాహారం పేరుగో లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసిన కోడి గుడ్లలో పురుగులు బయటపడుతున్నాయి. మడకశిర మండలంలో మంగళవారం ఈ ఘటన వెలుగు చూసింది. ఏఆర్ రొప్పం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గౌరీపురం గ్రామ లబ్ధిదారులకు మంగళవారం కోడి గుడ్లను అందజేశారు. ఆ సమయంలో కోడి గుడ్లు వాసన వస్తున్న విషయాన్ని గుర్తించిన లబ్ధిదారులు ఇంటికెళ్లి పరిశీలించారు. ఓ గుడ్డును తీసి పగులకొడితే పూర్తిగా కుళ్లి, అందులో నుంచి పురుగులు బయట పడ్డాయి. ఈ విషయాన్ని కొందరు యువకులు ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. కాగా, ఘటనపై అంగన్‌వాడీ కార్యకర్త మాట్లాడుతూ.. కుళ్లిన కోడి గుడ్లను తీసి పక్కన పెడితే గ్రామానికి చెందిన కొందరు యువకులు వాటిని తీసుకెళ్లి ఫొటోలు తీసి అభాసుపాలు చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

క్లుప్తంగా

కలెక్టర్‌కు సత్కారం



కలెక్టర్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ సర్వీసు అసోసియేషన్ సభ్యులు

అనంతపురం: ఉత్తమ ఎన్నికల అధికారిగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు మంగళవారం రెవెన్యూ సర్వీసు అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పోలీస్ డిపార్ట్‌మెంట్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సర్వీసు అసోసియేషన్ చైర్మన్ ఆర్. ఎన్ .దివాకర్ రావు, అసోసియేట్ చైర్మెన్ బి.మల్లరాయుడు, ట్రెజరర్ సంతోష్‌గౌడ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట చెన్నప్ప మహిళా విభాగం చైర్‌పర్సన్ బి. సురేఖరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం: ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఉద్యమాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న 600 మందికి పైగా ప్రతినిధులు ఈ సభలకు హాజరుకానున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ .నల్లప్ప, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎస్ .నాగేంద్రకుమార్, వి.రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం. నాగమణి, టి. రామాంజినేయులు, వై. వెంకటనారాయణ, ఎస్. ముత్తూజ, నగర నాయకులు ప్రకాష్‌రెడ్డి, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా శాంతి రథం, ఫ్రీజర్‌బాక్స్

అనంతపురం కల్చరల్: అంతిమ సంస్కారాలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు వీలుగా మానవత స్వచ్ఛంద సంస్థ మృతదేహాలను తీసుకెళ్లడానికి శాంతి రథాన్ని, ఫ్రీజర్‌బాక్సులను ఉచితంగా అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ఓ ప్రటనలో తెలిపారు. రోజురోజుకు పెరిగిపోతున్న నగర జనాభాకు తగ్గట్టుగా అందుబాటులో శాంతి రథాలు లేవని ఆ కొరతను కొంతైనా తీర్చడానికి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వివరాలకు సంస్థ చైర్మన్ జయరామప్ప 8074452943, అవోపా శ్రీనివాసుల శెట్టి 7013776329 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రూడ్‌సెట్ సందర్శన



రూడ్‌సెట్ డైరెక్టర్‌తో మాట్లాడుతున్న కెనరా బ్యాంకు జీఎం మిథున్ రాయ్

అనంతపురం: కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్ పి. మిథున్ రాయ్ రూడ్‌సెట్ సంస్థను మంగళవారం సందర్శించారు. సంస్థ కల్పిస్తున్న సౌకర్యాలపై ఉచిత శిక్షణ తీసుకుంటున్న మహిళలతో ఆరా తీశారు. శిక్షణానంతరం బ్యాంకు అందించే రుణ సదుపాయం, ఉపాధి అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు ఏజీఎం లారెన్స్, డీఎం మహబూబ్‌బాషా, రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్‌గౌడ్



కృష్ణయ్య నుంచి నియామకపత్రం అందుకుంటున్న రాజశేఖర్‌గౌడ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పామిడి గ్రామానికి చెందిన రాజశేఖర్‌గౌడ్ నియమితులయ్యారు. మంగళవారం విజయవాడలో జరిగిన బీసీ కుల సంఘాల సమావేశంలో ఆయనకు నియామక పత్రాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య అందజేశారు. ప్రస్తుతం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రాజశేఖర్‌గౌడ్‌ను బీసీ సంఘం 'రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్'గా, 'విద్యార్థి సంఘం రాష్ట్ర ఇన్‌చార్జ్'గా నియమించారు. తనపై నమ్మకం ఉంచి గురుతర బాధ్యతలు అప్పగించిన కృష్ణయ్య, ఇతర సభ్యులకు రాజశేఖర్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ ఫొటోను చూడండి. నగరంలోని హౌసింగ్ బోర్డుకు చెందిన ఓ వృద్ధురాలు ఇటీవల ఎఫ్ఎం వార్డులో చేరింది. అక్కడ పైకి మంచం బాగానే కన్పిస్తున్నా..బెడ్డు పూర్తిగా దెబ్బతినడంతో పీచు బయటకు వచ్చింది. దీంతో వృద్ధురాలు పడుకోలేక కూర్చునే ఉండాల్సి వచ్చింది.



ఇది మెడిసిన్ వార్డులో బెడ్డుల దుస్థితి. బెడ్డుపై భాగంలో ఉన్న రెగ్జిన్ పూర్తిగా దెబ్బతినడంతో అందులోని పీచు బయటకు వచ్చింది. దీంతో రోగులు బెడ్డుపై పడుకోలేని దుస్థితి. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.



ఇక్కడ సర్వమూ అవస్థలే!

- ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సమస్యల తిష్ట
- రోగులకు తప్పని కష్టాలు
- పట్టించుకోని ఆస్పత్రి సూపరింటెండెంట్

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో సర్వజనాస్పత్రిలో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు కరువైనా పట్టించుకునే వారు కరువయ్యారు. రోగులు పడుకునేందుకు కనీసం బెడ్లు కూడా సరిగా లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆస్పత్రిలో ప్రభుత్వం 560 పడకలకు మంజూరైనా రోగుల సంఖ్యను బట్టి వేయి దాకా పడకలు ఏర్పాటు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేయడంతోపాటు ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యరంగంతోపాటు ప్రభుత్వాస్పత్రిని పట్టించుకోవడం లేదు. దీనికి ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు నిర్లక్ష్యం తోడవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కనీస సౌకర్యాలు లేక రోగులు అష్టకష్టాలు పడుతున్నారు.

అధ్వానంగా బెడ్లు..

ఆస్పత్రిలో రోజూ 2 వేల మంది దాకా వస్తుంటారు. ఇక నిత్యం అడ్మిషన్‌లో అన్ని విభాగాలు(మెడిసిన్, సర్జరీ, ఆర్థో, ఎమర్జెన్సీ మెడిసిన్, లేబర్, గైనిక్, పల్మనాలజీ, సైకియాట్రీ, ఈఎన్‌టీ)దాదాపు 1100 మంది దాకా ఉంటారు. రోగులకు బెడ్లు సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఎఫ్ఎం, మేల్ మెడిసిన్, ఆర్థో, సర్జికల్, తదితర వార్డుల్లో బెడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. బెడ్డులో ఉన్న కొబ్బరిపీచు బయటకు వచ్చి సూదుల్లా గుచ్చుకుంటోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పని చేయని వాటర్ ప్లాంట్లు

ఆస్పత్రిలో వాటర్ ప్లాంట్లు పని చేయడం లేదు. ఆస్పత్రి మెడిసిన్, లేబర్, సర్జికల్ తదితర వార్డుల్లో వాటర్ ప్లాంట్లు ఉన్నా అలంకార ప్రాయంగానే ఉన్నాయి. రోగులు తాగునీటి కోసం ఆర్థో వార్డు వద్దకు రావాల్సి వస్తోంది. ఇక ఆర్థో వార్డులో లిఫ్ట్ పని చేయడం లేదు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతూనే వెళ్లాల్సి వస్తోంది. ఎంఎన్‌ఓలు అందుబాటులోకి లేకపోవడంతో రోగులతోపాటు వారి సహాయకులకు అవస్థలు తప్పడం లేదు. ఆస్పత్రిలో ఇంత జరుగుతున్నా సూపరింటెండెంట్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఎంఎన్‌ఓ అందుబాటులో లేకపోవడంతో బాలుడిని ఎత్తుకెళ్తున్న దృశ్యం



ఆర్థోవార్డులో పని చేయని లిఫ్ట్

సూదుల్లా గుచ్చుకుంటోంది

అరోగ్యం బాగోలేక వారం రోజులుగా ఎఫ్ఎం వార్డులో అడ్మిషన్‌లో ఉన్నా. బెడ్డుపై పీచు పైకి లేచింది సార్. పీచు సూదుల్లా గుచ్చుకుంటోంది. రాత్రి వేళల్లో నిద్ర రావడం లేదు. బాత్‌రూంకు వెళ్లినప్పుడు లైటు లేకపోతే ఎలా గయ్యా. ఆడవారికి ఇలాగేనే సదుపాయాలు కల్పించేది. కలెక్టర్, పెద్ద పెద్ద సార్లు ఏం చేస్తున్నారో?

– ఫైజున్ బీ,గుల్జార్ పేట



ఎలా పడుకోవాలయ్యా

ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందిగా ఉంటే పెద్దాస్పత్రికి వచ్చా. ఇక్కడ డాక్టర్లు బాగా చూస్తారు మంచి సదుపాయాలుంటాయని అనుకున్నాం. తీరా చూస్తే మంచాలు ఇలాగా ఉన్నాయి. పడుకునేందుకు వీలు లేక, ఇలాగే ఆక్సిజన్ తీసుకుంటూ కూర్చున్నా సార్. కనీసం ఇంత పెద్ద ఆస్పత్రిలో పరుపులు లేవా? పగవాడికి కూడా ఇంత ఇబ్బంది రాకూడదు.

– ఆదెమ్మ,కొత్త చెరువు



చంద్రబాబు వైఖరి అనుమానాస్పదం

- మేయర్ వసీం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ధోరణి అనుమానాస్పదంగా ఉందని మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముస్లిం మనోభావాలకు అనుగుణంగా జాయింట్ పార్లమెంటరీ కమిటీలో టీడీపీ సభ్యులు ఎందుకు సరణలు ప్రతిపాదించలేదో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. దర్గా, మసీదు, వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ఎన్డీఏ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ముస్లింల సందేహాలు తీర్చాకే బిల్లును ఆమోదించాలన్నారు. బిల్లుకు ఇప్పటికే ఆమోదం తెలపడం విచారకరమని, ప్రతిపాదిత బిల్లు ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టం వక్ఫ్ ఆస్తుల స్థితిని నాశనం చేయడానికి, తారుమారు చేయడానికి రూపొందించబడినదని ఆరోపించారు. మైనార్టీలు తీవ్ర నష్టాలు చవిచూడకుండా ఆయా రాష్ట్రాలు చర్యలు తీసుకుంటున్నట్టే ఏపీలో కూడా న్యాయం చేయాలని కోరారు. ఎన్నికలొచ్చాయంటే ముస్లింల అభివృద్దే లక్ష్యమని చెప్పే చంద్రబాబు ఇప్పుడు న్యాయం చేసి చూపించాలన్నారు. సవరణ బిల్లును కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి

అనంతపురం కల్చరల్: ఎన్నికల వేళ చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకుని వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని ఇన్సాఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మైనార్టీ నగర అధ్యక్షుడు చాంద్‌బాషా, ప్రధాన కార్యదర్శి ఖాజా హుస్సేన్, గౌరవాధ్యక్షుడు అల్లీపీరా మాట్లాడారు. బిల్లుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఆమోదం లభించడం విచారకరమన్నారు. అనేక సవరణలను అంగీకరించిన కమిటీ వక్ఫ్ సవరణ బిల్లుకు మాత్రం విపక్షాల అభిప్రాయం తీసుకోకుండా ఆమోద ముద్ర వేసిందన్నారు. వక్ఫ్ బిల్లులో చాలా ప్రమాదకరమైన ప్రతిపాదనలున్నాయన్నారు. బీజేపీ మతాల చిచ్చుపెడుతోందని ఆరోపించారు. మసీదులు, చర్చిలు, ఆలయాల పరిరక్షణకు ప్రత్యేక చట్టం ఉండాలని డిమాండ్ చేశారు. ముస్లింలకు పెద్ద పీట వేస్తున్నామని చెబుతున్న టీడీపీ ఇచ్చిన మాట తప్పకూడదన్నారు. కేరళ రాష్ట్రం అన్ని రాష్ట్రాల కంటే ముందుగా వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించిందని, ఆ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కూటమి నేతలకు సూచించారు.

'ఎస్వీ' కళాశాలలో ఎంప్లో ఎబిలిటీపై అవగాహన

అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీఎస్ఎస్‌డీసీ, మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ నాంది ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల బీఎస్సీ థర్డియర్ విద్యార్థులకు 'ఎంప్లో ఎబిలిటీ స్కిల్స్', బీకామ్, బీబీఏ విద్యార్థులకు 'టాలీ', 'జీఎస్టీ' అంశాలపై వారం రోజులుగా జరుగుతున్న శిక్షణ మంగళవారం ముగిసింది. ఈసందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించడంలో ఎంప్లో ఎబిలిటీ స్కిల్స్ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. జిల్లా నైపుణ్య శిక్షణ అధికారి పీవీపీ ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్, ఏఓ శ్రీనాథ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సాయిరామ్, ఏపీఎస్ఎస్‌డీసీ నాన్ టెక్నికల్ ఆఫీసర్ నీరజ, మహేంద్ర ప్రైడ్ క్లాస్‌రూమ్ నాంది ఫౌండేషన్ శిక్షణ అధికారులు మహబూబ్ సుభహాని, పాశ, కృష్ణచైతన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో శిక్షకులు, కళాశాల యాజమాన్యం

నిత్య స్తోత్రమాలిక పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మిక చింతన, భక్తిభావాన్ని పెంచేందుకు తోడ్పడేలా సీనియర్ న్యాయవాది ఆకులేటి మల్లికార్జునరెడ్డి సంకలనం చేసిన 'నిత్య స్తోత్రమాలిక' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సోమనాథనగర్‌లోని యోగా మందిరంలో జరిగిన సమావేశానికి ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధి కేవీఎస్ చలపతిరెడ్డి అధ్యక్షత వహించారు. ఘంటసాల ఆరాధన సమితి వ్యవస్థాపకుడు పాలసముద్రం నాగరాజు, కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించిన యోగా గురువు కోడూరు సుధాకర మూర్తి, డాక్టర్ పాణ్యం వసుంధర, కొత్తచెరువు రఘునాథ్ మాట్లాడారు. సేవాభావంతో అందరికి ఉచితంగా పుస్తకాలనందించాలన్న ఆశయం అభినందనీయమన్నారు. సంస్కృత భాషలో ఉండే స్తోత్రాలు, జపాలు, మంత్రబద్ధమైన ప్రతి అక్షరం ఆరోగ్యాన్ని పెంపొదిస్తాయన్నారు. అనంతరం సంకలన కర్త మల్లికార్జునరెడ్డిని సత్కరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యోగా మాస్టర్లు

పకడ్బందీ ఏర్పాట్లు చేయండి



లిక్కర్ డిపోను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం: నూతన ఎక్సైజ్ డిపో ప్రారంభానికి పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. అనంతపురం రూరల్‌లోని సోములదొడ్డి వద్దనున్న నూతన ఎక్సైజ్ డిపో, పాత ఎక్సైజ్ డిపోలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ నెల 31న నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో ఐడీ లిక్కర్‌కు సంబంధించి నూతన పాలసీలో భాగంగా నిర్వహించే నవోదయం కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర హాజరుకానున్నారు. సోములదొడ్డి వద్ద నూతన ఎక్సైజ్ డిపోను మంత్రి ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి, డిపో మేనేజర్ వెంకట్ నాయుడు, అసిస్టెంట్ డిపో మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఇటుకలపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్

అనంతపురం: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఇటుకలపల్లి ఎస్ఐ విజయ్ కుమార్ అన్నారు. అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాల, రైపర్ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే మరణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు.

అతివేగంతో రోడ్డు ప్రమాదాలు

అనంతపురం సెంట్రల్: అతివేగంతోనే రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువశాతం మంది మృతి చెందుతున్నారని ఎంవీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రెండవరోడ్డులో గాయత్రి ఇంగ్లిష్ మీడియంస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వాహనాలు నడపాలన్నారు. చిన్నపిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు.స్కూల్ కరస్పాండెంట్ నరేంద్ర, త్రినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాజశ్యామల నవరాత్రులు

అనంతపురం కల్చరల్: నగర శివారులోని శృంగేరి విరూపాక్ష మఠం జగద్గురు శంకర దత్తాత్రేయ మహా సంస్థానం వేదికగా గురువారం నుంచి వచ్చేనెల 6 వరకు మాతంగి రాజశ్యామల నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు పీఠాధిపతులు విద్యాన్ను సింహభారతీ స్వామీజీ ఓ ప్రకటన విడుదల చేశారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి



అలంకరణలో పెద్దమ్మ తల్లి

ఆత్మకూరు: పంపనూరులో మంగళవారం పెద్దమ్మ తల్లి జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత గ్రామ దేవతలైన పెద్దమ్మతల్లి, ముత్యాలమ్మ అమ్మవారికి దున్నపోతులను బలి ఇచ్చారు. అనంతరం మొక్కుబడి ఉన్న గ్రామస్తులు పొటేళ్లను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తండ్రి, తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి జాతరకు హాజరై గ్రామ దేవతలు అయిన పెద్దమ్మ తల్లికి, ముత్యాలమ్మ అమ్మవారికి పూజలు చేపట్టారు. పెద్ద ఎత్తున జనం రావడంతో గ్రామంలో సందడి నెలకొంది.

అలంకారప్రాయంగా స్తంభాలు



దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న విద్యుత్ స్తంభాలు



స్తంభాలకు విద్యుత్ కనెక్షన్ తొలగిపోయిన దృశ్యం



స్తంభానికి వేలాడుతున్న లైట్లు

అనంతపురం నుంచి రాచానపల్లికి వరకూ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు అలంకార ప్రాయంగా మారాయి. స్తంభాలు ఉన్నా లైట్లు ఏర్పాటు చేయలేదు. కొన్నిచోట్ల లైట్లు వేసినా పని చేయడం లేదు. దీంతో రాత్రి వేళల్లో అటువైపుగా వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

బిల్లులు చెల్లించాలని నిరసన



కమిషనర్ చాంబర్ ముందు బైఠాయించిన కాంట్రాక్టర్లు

అనంతపురం కార్పొరేషన్: అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని కోరుతూ నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లు మంగళవారం కమిషనర్ మల్లికార్జున రెడ్డి చాంబర్ ముందు బైఠాయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి 2.5 కోట్లు(15 అభివృద్ధి పనులు) చేపట్టినా ఇంత వరకు సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు చెల్లించలేదన్నారు. బిల్లులపై ఆరా తీయగా నగరపాలక సంస్థ నిధుల నుంచే చెల్లించాలంటూ రాష్ట్రస్థాయి నుంచి ఉత్తర్వులు వచ్చాయని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన కమిషనర్ తగు చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్లను శాంతింపజేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్లు రత్నమయ్య, నరసింహారెడ్డి, వెంకటేష్, కోగటం వేణుగోపాల్ రెడ్డి, టోపీ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



సుభాష్ రోడ్డులో డ్రైనేజీపై కమిషనర్‌కు సూచనలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ప్రధాన రోడ్లలోనే డ్రైనేజీ సమస్య ఏర్పడుతోందని, మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్ మల్లికార్జున రెడ్డికి మేయర్ వసీం సూచించారు. మంగళవారం సుభాష్ రోడ్డులో రోడ్డుపైకి మురుగు రావడంతో స్థానిక ప్రజలకు ఫిర్యాదు మేరకు మేయర్ కమిషనర్‌తో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎప్పటికప్పుడు కాలువల్లో పూడిక తీయకపోవడం కారణంగానే సమస్య తలెత్తుతోందన్నారు. ప్రధాన రోడ్లలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే ఎలాగని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్యాధికారులు సమన్వయం చేసుకుని మురుగు సమస్యను పరిష్కరించేలా చూడాలని సూచించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ కమల్‌భూషణ్, ఈఈ షాకీర్, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, డీఈఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.